# నేడు బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశాలు

- హాజరు కానున్న వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్
- ముస్తాబాద్, సిరిసిల్లలో భారీ ఏర్పాట్లు



రాజన్న సిరిసిల్ల, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో భాగంగా బీఆర్ఎస్ పార్టీ మంగళవారం ముస్తాబాద్, సిరిసిల్లలో కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ముస్తాబాద్‌లోని ఎంఎం గార్డెన్‌లో మండల పార్టీ కార్యకర్తల సమావేశం, మధ్యాహ్నం ఒంటి గంటకు సిరిసిల్లలోని రగుడు వద్ద ఉన్న తెలంగాణ భవన్‌లో తంగళ్లపల్లి మండల కార్యకర్తల సమావేశం ఉంటుందని పార్టీ నాయకులు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కార్యకర్తలకు కేటీఆర్ దిశానిర్దేశం చేయనుండగా, ముస్తాబాద్, సిరిసిల్లలో భారీ ఏర్పాట్లు చేశారు.



అంతర్గాం మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు



ఎల్లంపల్లిలో 148మీటర్ల నీటికి గానూ నిల్వఉన్న 144మీటర్ల నీళ్లు





గుండారం రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయకపోవడంతో వెలవెలబోతున్న కాలువ

## ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు

# కాళేశ్వరమే జీవధార

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం మొన్నటిదాకా బీడుభూములకు ప్రాణం పోసింది. మంథని నియోజకవర్గంలో ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు జీవధారమైంది. శ్రీరాంసాగర్ నుంచి నీళ్లిచ్చే పరిస్థితి లేకున్నా.. ఎల్లంపల్లి నుంచి లింక్ కెనాల్ ద్వారా నీరు ఇవ్వడంతో సాగు పండుగలా సాగింది. ఎల్లంపల్లిలోనూ నీటి లభ్యత లేని సమయంలో దిగువ నుంచి ఎత్తిపోసి నింపడంతో ఏనాడూ ఇబ్బంది కాలేదు. కానీ, ప్రస్తుతం సాగు ప్రశ్నార్థకంగా మారింది. శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లో నీటిమట్టం తగ్గడం, కాళేశ్వరం నుంచి ఎత్తిపోసే పరిస్థితి లేకపోవడం శాపంలా పరిణమిస్తున్నది. సాగునీరు లేక దాదాపు పది వేల ఎకరాల్లో పంటలు ఎండిపోతుండగా, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెర్రెలు వారుతున్న పొలాలను చూసి కన్నీరు పెడుతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఏనాడూ ఇలాంటి దుస్థితి రాలేదని గుర్తు చేస్తున్నారు. సాగు నీరందించడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలమైందంటూ ఆరోపిస్తున్నారు.

- నాలుగైదేండ్లుగా మంథని నియోజకవర్గానికి పుష్కలంగా జలాలు
- ఎస్సారెస్పీ నీళ్లు రాకున్నా.. లింక్ కెనాల్ ద్వారా ఎల్లంపల్లి నుంచి సాగునీరు
- యాసంగిలోనూ చివరి ఆయకట్టు వరకు పరుగులు
- ఈసారి మారిన పరిస్థితులు
- నీళ్లు లేక ఎండుతున్న పంటలు
- ప్రశ్నార్థకంగా పదివేలకుపైగా ఎకరాలు
- ఆందోళనలో రైతులు

కింది చిత్రంలో కనిపిస్తున్న కాకర్లపల్లికి చెందిన రైతు ఆకుల భాస్కర్. పదిహేనేళ్లుగా వ్యవసాయం చేస్తున్నడు. ఏడెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. అది ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు పరిధిలోని కాకర్లపల్లిలో ఉన్నది. మొన్నటి దాకా ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగు చేసుకున్నడు. ఏటా రెండు పంటలు పండించాడు. కానీ, ఈ యేడు ఒక్క తడుపు కూడా రాక ఆ ఏడెకరాల పొలం దాదాపు ఎండిపోయింది. దీంతో చేసేదేమీ లేక పొలంలో ఇలా ఎడ్లను మేపుతున్నడు. కాంగ్రెస్ పాలనలో ఇగ నష్టమే తప్ప రైతులకు లాభం ఉండదని, వ్యవసాయమే ఇక దండుగ అని ఆగ్రహిస్తున్నడు. కేసీఆర్ ప్రభుత్వంలో పుష్కలంగా నీళ్లు వచ్చాయని, రెండు పంటలు పండించామని గుర్తు చేస్తున్నడు.



పొలంలో ఎడ్లను మేపుతున్న రైతు భాస్కర్



ఎండిపోయిన కాలువను చూపిస్తున్న కాకర్లపల్లి రైతులు

పెద్దపల్లి, మార్చి 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాక ముందు మంథని నియోజకవర్గంలో సాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు భూములకు నీరందకపోయేది. ఏటా యాసంగిలో పంటలు ఎండిపోయే పరిస్థితి ఉండగా, రైతులు ఆగమయ్యేది. ఇలాంటి కరువు పరిస్థితులను దూరం చేసే ఉద్దేశంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గుండారం రిజర్వాయర్‌కు పైప్‌లైన్ వేసింది. దీని ద్వారా ఎల్లంపల్లి నుంచి 2టీఎంసీల నీటిని గుండారం, బేగంపేట, శుక్రవారంపేట రిజర్వాయర్లను నింపుకొని, కమాన్‌పూర్, ముత్తారం, మంథని ప్రాంతాల్లోని ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు ఇవ్వాలని భావించింది. అయితే ఏటా మార్చి తర్వాత ఎల్లంపల్లి ప్రాజెక్టులో తగినంత నీటి లభ్యత లేక నీళ్లిచ్చే పరిస్థితి ఉండేది కాదు. దాంతో పంటలు చేతికొచ్చే దశలో ఎండిపోయేవి. పెట్టిన పెట్టుబడులు ఎల్లక రైతులకు అప్పులే దిక్కయ్యేవి. ఒక దశలో ఆత్మహత్యలే శరణ్యమయ్యేవి. కానీ, కేసీఆర్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించడంతో పరిస్థితి మారింది. మేడిగడ్డ నుంచి ఎగువ బ్యారేజీల్లోకి గోదావరి జలాలను ఎత్తిపోయడంతో ఎల్లంపల్లి ఎప్పుడూ నిండుగా ఉండేది. దాంతో మంథని నియోజకవర్గంలోని ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు వరకూ సమృద్ధిగా నీరందింది. గతేడాది మార్చిలో పార్వతీ పంప్‌హౌస్ ద్వారా ఎల్లంపల్లిలోకి నీటిని ఎత్తిపోసుకోవడంతో సాగునీటి సమస్య లేకుండా పోయింది. అప్పుడు ఎల్లంపల్లిలో 20.175టీఎంసీల సామర్థ్యానికి గాను 18.536 టీఎంసీల నీరు నిల్వ చేశారు. గతేడాది ఎస్సారెస్పీకి తోడు లింక్ కెనాల్ ద్వారా డీ-83, 86 కెనాళ్లకు ఎల్లంపల్లి జలాలను అందించారు. దాంతో ఎస్సారెస్పీ జలాలపై ఆధారకుండానే పంటలకు సమృద్ధిగా నీళ్లిచ్చారు. కానీ, ప్రస్తుతం సాగునీరు రాక ఎండుతున్న పంటలను చూసి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మంథని నియోజవర్గంలో సాగునీరందక నెర్రెలు వారిన పొలం

### తాగునీటి అవసరాలకే కష్టం

ప్రస్తుతం ఎస్సారెస్పీలో 90 టీఎంసీల సామర్థ్యానికి గాను 31.42 టీఎంసీలే ఉన్నాయి. ఇవి రానున్న వేసవి నేపథ్యంలో సాగునీరు, తాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగపడనున్నాయి. ఇటు ఎల్లంపల్లి ప్రాజెక్టులోనూ 10 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. అవి కూడా తాగునీటి అవసరాలు, ఎన్టీపీసీ విద్యుదుత్పత్తికి మాత్రమే సరిపోనున్నాయి. ప్రతి రోజూ ఇక్కడి నుంచి హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం 331 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121క్యూసెక్కులు, గూడెం కెనాల్‌కు 145క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రతి రోజూ మొత్తం 595క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఇదే లెక్కన నీటి వినియోగం జరిగితే జూన్, జూలై వరకూ హైదరాబాద్ తాగునీటి అవసరాలకే సరిపోయే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు సాగునీరివ్వడం గగనంగానే కనిపిస్తున్నది.

### ఎండిపోతున్న పంటలు

గతంలో ఎస్సారెస్పీ నుంచి నీళ్లు రాకున్నా.. లింక్ కెనాల్ ద్వారా ఎల్లంపల్లి నుంచైనా నీళ్లిచ్చేది. కానీ, ఈ సారి అటు ఎస్సారెస్పీ, ఇటు ఎల్లంపల్లి నుంచి సాగు నీరు వచ్చే పరిస్థితి లేదు. దీంతో మంథని నియోజకవర్గంలో మళ్లీ ఇబ్బందులు మొదలయ్యాయి. దాదాపు పది వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే చాలాచోట్ల దెబ్బతింటున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే వచ్చే ఏప్రిల్, మేలో పెద్ద ఎత్తున నష్టపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కండ్లముందే ఎండుతున్న పంటలను చూసి కన్నీరుమున్నీరవుతున్నారు. పాలకుల అవగాహనలోపం, పట్టింపులేనితనంతోనే ఈ దుస్థితి వచ్చిందని మండిపడుతున్నారు. తక్షణం తడుపు ఇస్తే తప్పా పంటలను కాపాడుకునే అవకాశం లేదని చెబుతున్నారు. ఇటు పంటలను రక్షించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. కొందరు చేసేదేమీ లేక పంటలను వదిలేస్తున్నారు.

### కాళేశ్వరమే పరిష్కారం

కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిన నాటి నుంచి పెద్దపల్లి జిల్లాకు ఎక్కడా సాగునీటి సమస్య రాలేదు. ప్రధానంగా ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు ప్రాంతమైన మంథని నియోజకవర్గానికి ఏ ఇబ్బందీ ఎదురుకాలేదు. మూడు నాలుగేండ్లుగా గోదావరి జలాలను మేడిగడ్డ వద్ద ఒడిసిపట్టి, ఎగువ బ్యారేజీలు, పంపుహౌస్‌లతో ఎల్లంపల్లిని నింపుకోవడంతో ఎప్పుడు చూసినా ఆ ప్రాజెక్టు నిండుగా కనిపించేది. లింక్ కెనాల్ ద్వారా ఎస్సారెస్పీ ఆయకట్టుకు సాగునీటిని అందించాలన్నా.. 2 టీఎంసీల ద్వారా మంథని నియోజకవర్గంలోని చివరి ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాలన్నా.. కాళేశ్వరం ఎత్తిపోతలే శాశ్వత పరిష్కారంగా ఉన్నది. దాంతోనే రైతులు సంబురంగా సాగు చేసుకుంటున్నారు. యాసంగిలోనూ బంగారం లాంటి పంటలు పండిస్తున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారింది. అవగాహన, ప్రణాళికా లోపం ఈ ప్రాంత రైతులకు శాపంలా పరిణమించింది. ఈసారి సాగునీరు లేక వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతుండగా, సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. మేడిగడ్డ బ్యారేజీకి వేగంగా మరమ్మతులు చేపట్టి ఎత్తిపోతలను కొనసాగిస్తేనే వచ్చే సీజన్‌లోనైనా పంటలకు నీరందుతుంది. లేదంటే భూములు బీళ్లుగా ఉంచే దుస్థితి వస్తుంది. అందుకే రాజకీయాలను పక్కన పెట్టి తక్షణమే కాళేశ్వరం ప్రాజెక్టును అందుబాటులోకి తేవాలని కర్షకలోకం విజ్ఞప్తి చేస్తున్నది.

### మోయెడు పంటలు మంచిగా పండినయ్



మాది కాకర్లపల్లి. మోయెడు పుష్కలంగా కాలువ నీళ్లు అచ్చినయి. పంటలు మంచిగా పండినయి. అందుకే ఈ యేడు చెరువెనుక ఆరెకురాలు, బోరు కింద మూడెకురాలు కౌలుకు తీసుకొని దున్నుతున్న. ఇప్పటి దాకా ఒక్క చుక్క నీళ్లు రాలే. బోర్ల నీళ్లు అత్తలెవ్వు. పొలం అల్లిపోతంది. పంటెట్ల పండుతది? ఎడ్ల మేపుడే అయేటట్టు ఉన్నది. గరీబోల్లం గదా. బటాయికి తీసుకున్న కాడ ఏం ఇయ్యాలే. ఆసామికి ఏం గట్టాలే. ఇప్పటికే ఎకురానికి ముప్పై వేల దాకా ఖర్చయింది. గిట్లయితే మేం ఎట్ల బతుకుతం? ఏది ఏమైనా మాకు కాలువ నీళ్లు కావాలే. పంటలు పండిచ్చుకోవాలే. గట్ల జూడాలే.

**- తోట రాజయ్య, కాకర్లపల్లి (మంథని మండలం)**

### ఎన్నడూ గుంట కూడా ఎండలె



కాళేశ్వరం నడిచినన్ని రోజులు మాకు ఏ రోజు సాగు నీటికి ఇబ్బంది కాలేదు. పుష్కలంగా సాగు నీరు వచ్చింది. పంటలు పండిచ్చుకున్నం. ఇప్పుడెందుకు ఈ సమస్య వచ్చిందో ప్రభుత్వమే పరిశీలించాలే. నేను ఆరెకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న. నాట్లప్పుడు ఒక్క తడుపు వచ్చింది. ఇగ మల్ల కాలువల్ల నీళ్లు కానరాలె. ఇట్లైతే రైతు ఎట్ల బతుకుడు? రైతుకు ఎట్ల కౌలు గట్టాలె? అసలు ఎట్ల బతుకుడు? ఈ ఏడు నష్టమే. కేసీఆర్ సీఎం ఉన్నన్నీ రోజులు ఎన్నడూ గుంట కూడా ఎండలె. గట్ట జూసుకున్నడు.

**-తానె లింగయ్య, రామకిష్టాపూర్ (ముత్తారం మండలం)**

# సీనియర్లకే అవకాశం

**కరీంనగర్, పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థులుగా వినోద్‌కుమార్, కొప్పుల ఈశ్వర్**

- అధికారికంగా ప్రకటించిన బీఆర్ఎస్ అధిష్టానం
- పలువురు నాయకుల హర్షం
- భారీ మెజార్టీతో గెలిపిస్తామని వెల్లడి





కరీంనగర్, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉద్యమకారులు, సీనియర్ నాయకులకు బీఆర్ఎస్ అధిష్టానం మరోసారి అవకాశం కల్పించింది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మాజీ పార్లమెంట్ సభ్యుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు కరీంనగర్, మరో సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు పెద్దపల్లి టికెట్లు ఖరారు చేసింది. వీరి అభ్యర్థిత్వాన్ని ఇప్పటికే వెల్లడించిన పార్టీ అధినేత కేసీఆర్, సోమవారం అధికారికంగా ప్రకటించారు. పార్టీలో సీనియర్ నాయకులు, వివాదరహితులైన ఈ ఇద్దరికి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించడంతో బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో వీరి గెలుపు ఖాయమనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ వెంట నడిచిన బోయినపల్లి వినోద్‌కుమార్, కొప్పుల ఈశ్వర్ పార్టీ పటిష్టతకు అహర్నిషలు శ్రమించారు. గత అసెంబ్లీ ఎన్నికల వరకు కీలక పదవు ల్లో ఉన్న ఈ ఇద్దరు నాయకులు ప్రజ ల్లో మంచి గుర్తింపు సాధించారు.

### కలిసికట్టుగా ఉండి గెలిపించుకుంటాం

**-మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

బీఆర్ఎస్ శ్రేణులందరం కలిసి కట్టుగా ఉండి కరీంనగర్‌లో వినోద్‌కుమార్, పెద్దపల్లిలో కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు. వినోద్‌కుమార్‌కు కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన అధినేత కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి కేసీఆర్ వెంట నడిచిన వినోద్‌కుమార్‌కు కరీంనగర్‌లో మరోసారి పోటీ చేసే అవకాశం కల్పించడం హర్షణీయమన్నారు. గతంలో ఎంపీగా ఉన్నపుడు కేంద్ర ప్రభుత్వంతో పోరాడి జిల్లాకు జాతీయ రహదారులు, రైల్వే లైన్లు తెచ్చిన ఘనత వినోద్‌దేనని కొనియడారు. ఇప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీ బండి సంజయ్ ప్రధానిని ఒప్పించి ఒక్క అభివృద్ధి పనినైనా చేయలేకపోయాడని విమర్శించారు. అనతి కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విరక్తి పుట్టిందని, వారి అసత్యాలు, అమలు కాని హామీలపై ప్రజల్లో చర్చ జరుగుతున్నదని తెలిపారు. వినోద్‌కుమార్, కొప్పుల ఈశ్వర్‌కు అవకాశం కల్పించినందుకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు హర్షం వ్యక్తం చేశారు.

### పెద్దపల్లిలో గులాబీ జెండా ఎగురవేస్తాం

**-రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**

గోదావరిఖని, మార్చి 4 : పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ప్రకటించడంపై రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ హర్షం వ్యక్తం చేశారు. అధినేత కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. గులాబీ సైనికులంతా పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## కేకే వ్యాఖ్యలపై

# పద్మశాలీల ఫైర్



సిరిసిల్ల పట్టణంలోని పద్మశాలీ సంఘం భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న పద్మశాలీ సంఘం నేతలు బొల్లి రామ్మోహన్, గుండ్లపల్లి పూర్ణచందర్, తదితరులు

- వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- లేకుంటే రేవంత్‌రెడ్డి పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరిక
- విలేకరుల సమావేశంలో పద్మశాలీ సంఘం నేతలు

సిరిసిల్ల టౌన్, మార్చి 4: కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డిపై పద్మశాలీలు ఆగ్రహించారు. తమ సమాజాన్ని కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. వెంటనే కేకే సిరిసిల్ల నేతన్న విగ్రహం వద్దకు వచ్చి, ముక్కునేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే జేఏసీగా ఏర్పడి సిరిసిల్లకు రాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. అలాగే ఈ నెల7న సీఎం రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఈ మేరకు సిరిసిల్ల పద్మశాలీ సంఘం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం నాయకుడు బొల్లి రామ్మోహన్ మాట్లాడారు. కేకే అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు. బతుకమ్మ చీరెల ఆర్డర్లు లేక ఓ ఆసామి ఉపాధి కోల్పోయి పాపడాలు అమ్ముకుంటున్న వీడియోను సోషల్ మీడియాలో చూసి ఆయన 'ఎంతమంది పాపడాలు అమ్ముకుంటున్నరు? ఎంత మంది నిరోధ్ ప్యాకెట్లు అమ్ముకుంటున్నారు' అని మాట్లాడడం ఆయనకు సంస్కారానికి నిదర్శనమన్నారు. హైకోర్టు న్యాయవాదిని, తెలంగాణ ఉద్యమకారుడిని అని చెప్పుకునే ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సిరిసిల్ల నియోజకవర్గంలో 80 వేల ఓటు బ్యాంకు ఉన్న పద్మశాలీ సమాజాన్ని ఈవిధంగా అవమానించాలని రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ నేతలకు చెబుతున్నారా..? అని ప్రశ్నించారు. ఇష్టారాజ్యంగా మాట్లాడితే సహించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం పట్టణ పద్మశాలీ సంఘం యువజన విభాగం అధ్యక్షుడు గుండ్లపల్లి పూర్ణచందర్ మాట్లాడుతూ, కొత్త ప్రభుత్వం ఏర్పాటు తర్వాత వస్త్ర పరిశ్రమకు సంబంధించిన ఆర్డర్లు లేక కార్మికుడు తేళ్ల సత్యం ప్రత్యామ్నాయ ఉపాధి పొందితే.. కేకే మహేందర్‌రెడ్డి తప్పుడు మాటలు మాట్లాడారని మండిపడ్డారు. బతుకమ్మ చీరెల ఆర్డర్లు ఇవ్వాలని అడిగితే ఆరేండ్లు దొబ్బితిన్నది చాలదా..? అని మాట్లాడడం బాధాకరమన్నారు. అధికార మదంతో మాట్లాడితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేయాలని, ఓటు వేయలేదని కక్షసాధింపు చర్యలు సరికాదన్నారు. అనంతరం పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు దార్ల సందీప్, గెంట్యాల శ్రీనివాస్, తెలంగాణ పద్మశాలీ జేఏసీ వ్యవస్థాపకుడు వాసాల లక్ష్మీనారాయణ మాట్లాడారు. సిరిసిల్ల నేతన్నలు మూడు నెలలుగా 'అన్నమో రామచంద్ర' అంటూ కడుపులు మాడ్చుకుని జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో నేతన్నలపై కేకే చేసిన వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయన్నారు. ఓటువేయలేదన్న అక్కసుతో పద్మశాలీ జాతిని కించపరిచేలా మాట్లాడడం ఎంతవరకు సమంజసమన్నారు. నామమాత్రంగా సోషల్ మీడియా కాకుండా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, లేదంటే రాష్ట్ర కమిటీకి పిలుపునిచ్చి ఎక్కడికక్కడ కాంగ్రెస్ నేతలను అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు. సమావేశంలో డాక్టర్ గాజుల బాలయ్య, రాపెల్లి ప్రవీణ్, ఆడెపు రవీందర్, మోర రవి, ప్రకాష్, నాగుల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

# అటకెక్కిన సీఎం బ్రేక్‌ఫాస్ట్

- జగిత్యాల జిల్లాలో నిలిచిన రాగిజావ పథకం
- 'పది' ప్రత్యేక తరగతుల్లో కనిపించని అల్పాహారం
- ఆకలితో అలమటిస్తున్న చిన్నారులు
- పథకాలపై విధానాన్ని ప్రకటించని కొత్త ప్రభుత్వం
- చదువుల కోవెలలపై తీవ్ర ప్రభావం

గతేడాది అక్టోబర్ వరకు ఉత్సాహంగా కనిపించిన ప్రభుత్వ పాఠశాలల్లో నేడు నిరుత్సాహం గోచరిస్తున్నది. పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో కేసీఆర్ సర్కారు తెచ్చిన పథకాలు ఒక్కొక్కటిగా అటకెక్కడంతో విద్యార్థులు ఆకలితో అలమటించే దుస్థితి కనిపిస్తున్నది. సీఎం బ్రేక్‌ఫాస్ట్, రాగిజావ పథకాలతోపాటు పది ప్రత్యేక తరగతుల సమయంలో అందించిన ఉత్తేజ అల్పాహారం సైతం నిలిచిపోవడం, కొత్తగా వచ్చిన సర్కారు స్పష్టత నివ్వకపోవడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు చదువులు మళ్లీ కొండెక్కే పరిస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



జగిత్యాల, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు ఉదయం సైతం పౌష్టికాహారం ఇవ్వాలన్న సదుద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం గతేడాది అక్టోబర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకానికి నాంది పలికింది. పౌష్టికాహార లోపాన్ని నిర్మూలించడం, బడి పిల్లల హాజరు పెంచడం, డ్రాపౌట్స్‌ను తగ్గించడం, పిల్లల సామర్థ్యం పెంపే లక్ష్యంగా ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. సోమవారం నుంచి శనివారం వరకు అల్పాహారం మెనూను రూపొందించారు. ఇడ్లీ సాంబార్/గోధుమరవ్వ, పూరి ఆలూ కూర్మా/టమాటా బాత్, ఉప్మా సాంబార్/రైస్, రవ్వ, ఇడ్లీ సాంబార్/పొంగల్, ఉగ్గాని/పోహా/గోధుమరవ్వ, కిచిడి, పొంగల్/వెజిటెబుల్ పలావ్‌ను మెనూలో పొందుపర్చారు. ఈ పథకం అమలు బాధ్యతలను విద్యాశాఖతోపాటు, పంచాయతీరాజ్, మాతా శిశు సంక్షేమశాఖ, ఆరోగ్యశాఖలకు అప్పగించి సమన్వయంతో ముందుకు సాగాలని ఆదేశించారు. అల్పాహారం తయారు చేసే విధులను మధ్యాహ్న భోజన తయారీదారులకు ఇచ్చారు. గతేడాది అక్టోబర్ 6న సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించారు. దసరాకు ముందు ప్రారంభించిన ఈ పథకాన్ని సెలవుల అనంతరం అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని నిర్దేశించారు. తర్వాత అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో కొన్ని పాఠశాలల్లో మాత్రమే అమలు చేశారు. అయితే మధ్యాహ్న భోజన నిర్వాహకులు రెండు మూడు నెలల పాటు సక్రమంగా అల్పాహారం అందించినా.. ఆ తర్వాత బిల్లులు రాక సీఎం బ్రేక్‌ఫాస్ట్‌ను ఇవ్వడం మానేశారు. అయితే డిసెంబర్‌లో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత వరకు ఈ పథకంపై తన వైఖరిని ప్రకటించ లేదు. దాంతో జిల్లా వ్యాప్తంగా ఈ అల్పాహార కార్యక్రమం పూర్తిగా నిలిచిపోయింది.

### నిలిచిన రాగిజావ పథకం

మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ప్రతి సోమ, బుధ, శుక్ర వారం కోడిగుడ్డును అందిస్తూ వస్తున్నారు. మిగిలిన మూడు రోజుల్లో పిల్లలకు బలవర్ధక ఆహారం కోసం రాగి జావను అందించారు. అందులో 8 శాతం ప్రొటీన్స్, 70 శాతం పిండి పదార్థాలు, 20 శాతం పీచు, 2 శాతం మినరల్స్ ఉండేలా చూశారు. ఇక ఉన్నత పాఠశాలల బాలికల్లో రక్తహీనత నిర్మూలన కోసం ప్రత్యేకంగా ఐరన్‌ను అందించారు. ప్రతి బాలికకు రాగిజావతోపాటు పదిగ్రాముల బెల్లం ఇచ్చారు. అయితే, జగిత్యాల జిల్లాలో ఇవేవీ ప్రస్తుతం పాఠశాలల్లో అందించడం లేదని పిల్లలు చెబుతున్నారు.

### పది ప్రత్యేక తరగతుల్లో ఆకలి కేకలు

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 187 ఉన్నత పాఠశాలల్లో 5,460 మంది పదో తరగతి చదువుతున్నారు. వీరు మార్చి, ఏప్రిల్‌లో పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తమ ఫలితాల కోసం రాష్ట్ర విద్యాశాఖ గతేడాది నవంబర్ నుంచే ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. ప్రతి పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం తరగతులను నిర్దేశించింది. పదో తరగతి బోధించే సబ్జెక్ట్ టీచర్లు ఉదయం గంట, సాయంత్రం గంట ప్రత్యేక తరగతులు బోధించాలని ఆదేశించింది. ఈ మేరకు టైమ్‌టేబుల్ సైతం రూపొందించి అమలు చేస్తున్నారు. అలాగే, పది విద్యార్థులకు, రెండు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. అయితే, ఉదయం 8.30 గంటలకు పాఠశాలకు చేరుకుంటున్న పది విద్యార్థులు సాయంత్రం 5.40 నిమిషాల వరకు (మినిమమ్) ఉండాల్సి వస్తున్నది. దాదాపు పది గంటల పాటు పిల్లలు పాఠశాలల్లోనే ఉండి విద్యాభ్యాసం చేస్తుండగా, అదనపు తరగతుల సమయంలో అల్పాహారం లేక ఆకలితో అలమటించే దుస్థితి వచ్చింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం పది పిల్లలకు అదనపు తరగతుల సమయంలో ప్రత్యేక అల్పాహారాన్ని అందించింది. జగిత్యాల జిల్లాలో కలెక్టర్లు ఉత్తేజం పేరిట, వారి ప్రత్యేక నిధుల నుంచి నిధులు కేటాయించి, పిల్లలకు ఉదయం, సాయంత్రం వేళల్లో అల్పాహారం అందిస్తూ వచ్చారు. అప్పటి ప్రభుత్వం సైతం దీనికి అనుమతులు ఇచ్చింది. అయితే, కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం పది పిల్లలకు అదనపు తరగతుల్లో అల్పాహారం కోసం నిధులు ఇవ్వకపోవడంతో ఈ పద్ధతి అమలు కావడం లేదు.